క్లుప్తంగా


యూపీహెచ్‌సీకి ఆర్‌ఓ ప్లాంట్‌ వితరణ



ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్‌ సభ్యులు

రాజాం సిటీ: స్థానిక ఆదర్శనగర్‌ అర్బన్‌ పీహెచ్‌సీకి వచ్చిన రోగులకు సురక్షిత నీటిని అందించేందుకు రోటరీక్లబ్‌ సభ్యులు ఆర్‌ఓ ప్లాంట్‌ను వితరణగా సోమవారం అందించారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్‌ రాజాం అధ్యక్షుడు కొల్లా కృష్ణారావు మాట్లాడుతూ రోగులకు తాగునీటి అవసరం నిమిత్తం ఆర్‌ఓ ప్లాంట్‌తో పాటు ప్లాస్టిక్‌ కుర్చీలు అందించడం ఆనందంగా ఉందన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్‌ రొటేరియన్‌ ఆకిరి రామారావు, కార్యదర్శి గట్టి పాపారావు, ఆఫ్తాల్మిక్‌ అధికారి ఎస్‌.వసంతరావు, పెంకి గౌరీశ్వరరావు, వైద్యాధికారి యు.కిరణ్‌కుమార్‌, హెచ్‌వీ కళావతి, ఎల్‌టీ సింహాచలం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రహదారితో అవస్థలు



రాళ్లుతేలి అధ్వానంగా ఉన్న నందిగాం - కుసుమూరు రోడ్డు

తెర్లాం: మండలంలోని నందిగాం – కుసుమూరు రోడ్డు పూర్తిగా రాళ్లు తేలి అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు, వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. కొన్నేళ్ల క్రితం తారురోడ్డుగా ఉన్న ఈ రోడ్డుపై దుక్కి ట్రాక్టర్లు, ఇసుక ట్రాక్టర్‌ ఎక్కువగా తిరగడంతో రోడ్డంతా పూర్తిగా మరమ్మతులకు గురైంది. ప్రస్తుతం రోడ్డంతా రాళ్లు తేలిపోయి ద్విచక్ర వాహనాలు కూడా నడపలేని దుస్థితి కలుగుతోంది. కుసుమూరు, కె.కుసుమూరు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వచ్చేందుకు ఈ రోడ్డుపై నుంచి ప్రయాణాలు సాగిస్తుంటారు. నిత్యం ప్రయాణికులు, వాహనాలతో రద్దీగా ఉండే రోడ్డు మరమ్మతులకు గురైనా కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు అభివృద్ధిపై పట్టించుకోవడం లేదని నందిగాం, కుసుమూరు, కె.కుసుమూరు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నందిగాం–కుసుమూరు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

మండల పరిషత్‌ నిధులతో అభివృద్ధి పనులు



లక్ష్మణవలసలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు

రేగిడి : మండల పరిషత్‌ 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌, ఎంపీపీ జాడ అప్పలనరసమ్మ, వైస్‌ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు మండల పరిషత్‌ నిధులను మండలంలో పలు పంచాయతీలకు కేటాయించారు. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చురుగ్గా సాగుతున్నాయి. ప్రజలకు అవసరమైన చోట్ల ఈ పనులు చేపడుతున్నామని ఆయా గ్రామాల సర్పంచ్‌లు చెబుతున్నారు.

పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



శిక్షణలో మాట్లాడుతున్న వైస్‌ ఎంపీపీ జగన్మోహనరావు

రేగిడి : పంచాయతీల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని వైస్‌ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు అన్నారు. మండల పరిషత్‌ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు, వీఆర్‌ఓలకు సోమవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి జరగాలంటే నిధులు ఉండాలని, ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని అన్నారు. నిధులను సక్రమంగా వినియోగించుకొని అభివృద్ధి జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్యామలాకుమారి, ఈఓపీఆర్‌డీఓ సత్యనారాయణ అధికారులు పాల్గొన్నారు.

ఆర్గానిక్‌ ధాన్యానికి భలే డిమాండ్‌..!

- ప్రకృతి వ్యవసాయంతో పోషకాహారం
- ఇన్‌గ్యాప్‌ బ్రాండింగ్‌తో అమ్మకాలు
- మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపు

బొబ్బిలి రూరల్‌:

ప్రకృతి వ్యవసాయంలో సహజంగా దొరికే మొక్కల, చెట్ల కషాయాలతో సేద్యం చేసిన ఆర్గానిక్‌ ధాన్యానికి మార్కెట్లో తీవ్ర పోటీ నెలకొంది. వివిధ రకాల రసాయనాలు, పురుగుల మందులతో పండిస్తున్న పంటలను ఆస్వాదిస్తున్న నేటి తరానికి చిన్న వయసులోనే బీపీ, సుగర్‌, థైరాయిడ్‌, కంటి చూపు మందగింపు, మోకాళ్ల నొప్పుల వంటివి శరీరాన్ని తినేస్తున్నాయి. వాటిని అదుపులో ఉంచేందుకు వాడుతున్న మందులు మరింత ఆరోగ్యాన్ని దిగజారుస్తున్నాయి. వీటన్నింటికి మూలకారణమైన ఆహార ధాన్యాలను ప్రకృతి పరంగా సేద్యం చేయాలన్న సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించింది. 2022వ సంవత్సరంలో దీనికి బీజం పడింది. పొలంబడి కార్యక్రమం రూపుదిద్దుకుంది. ముందుగా పంట దిగుబడి, నాణ్యత, పోషకాల లెక్కింపుతో మదింపు చేసి అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా వీటి సాగును గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రోత్సహించింది. ప్రత్యేక సిబ్బందిని నియమించి, వారికి శిక్షణలను ఇచ్చి ప్రకృతి సేద్యం, ఆర్గానిక్‌ పంటల సాగును ప్రారంభించింది. నాడు పొలంబడి ద్వారా ప్రారంభం కాగా నేడు అది సత్ఫలితాలనిస్తోంది. ఈ ఖరీఫ్‌ సీజన్‌లో మండలంలో ప్రయోగాత్మకంగా కారాడ, అలజంగి, కొత్తపెంట, జగన్నాధపురం గ్రామాల్లో రసాయనాలు లేని దాదాపు 30 హెక్టార్లలో ఆర్గానిక్‌ వరి సాగు చేశారు. ఎకరాకు 80 కేజీల బరువు గల 30 బస్తాల ధాన్యాన్ని రైతులు పండించారు. ప్రభుత్వం సాధారణంగా రసాయనాలతో పండించే వరికి మద్దతు ధర రూ.2,300 ఇస్తుండగా, ఆర్గానిక్‌ వరి పంటకు క్వింటాకు రూ.2,800 చొప్పున కొనుగోలు చేస్తోంది. అలాగే ప్రైవేటు వర్తకులు కూడా ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసి మార్కెట్లో అదనపు ధరతో విక్రయాలు జరుపుతున్నారు. మరో విశేషమేంటంటే ఏదైనా బ్రాండెడ్‌ పంటను ఇండిగ్యాప్‌ సర్టిఫికెట్‌ కావాలంటే వ్యాపారులకు 50వేల రూపాయిల వరకు ఖర్చు అవుతోంది. ఈ ధాన్యానికి ఏ విధమైన ఖర్చు లేకుండానే ఇండిగ్యాప్‌ సర్టిఫైడ్‌ ధృవపత్రాన్ని అందిస్తున్నామని వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యాంసుందర్‌ తెలిపారు. ప్రైవేటు మార్కెట్లో మంచి డిమాండ్‌ ఉందని రైతులు ప్రకృతి వ్యవసాయానికి మారాలని సూచించారు.



ప్రకృతి వ్యవసాయంతో పండించిన ధాన్యం విక్రయాలను ప్రారంభిస్తున్న ఏడీ



ఇండిగ్యాప్‌ సర్టిఫైడ్‌ బ్రాండ్‌ ధాన్యం బస్తాలు

కొనుగోలు ప్రారంభం

సోమవారం మండలంలోని కారాడ గ్రామంలో ఆర్గానిక్‌ వరి పంట కొనుగోలును వ్యవసాయ శాఖ ఏడీ శ్యాంసుందర్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో పోషకాలున్న ఈ ధాన్యాన్ని నిరభ్యంతరంగా అంతా వినియోగించుకోవచ్చని సూచించారు. శరీరానికి మంచి పుష్టినిస్తుందని వివరించారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 537లో పెత్తందారుల ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకుని నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి అలమండ ఆనందరావు డిమాండు చేశారు. మండలంలోని కొట్టక్కిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సోమవారం తహసీల్దార్‌ సులోచనరాణికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 30 ఎకరాల డీ పట్టా భూమి సాలూరుకు చెందిన టొంపలి నాగరాజు, వారి కుటుంబీకుల పేర్లతో కబ్జా చేశారన్నారు. అయితే గతంలో ఈ భూమిని 65 మంది పేదలకు ఎకరా చొప్పున్న నాటి దివంగత నేత రాజశేఖరరెడ్డి పంపిణీ చేసినా ఫలితం లేకపోయిందన్నారు. కొంత మంది సాగు చేస్తున్నా పట్టా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమస్యను తక్షణమే పరిష్కారం చేయాలని డిమాండు చేశారు. కొట్టక్కి ఎస్సీ కుటుంబాలకు శాశ్వతమైన శ్మశానం లేక ఇబ్బందులు పడుతున్నారని ఐదెకరాల స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కొట్టక్కి గ్రామానికి చెందిన బులయ్య, పోలయ్య, రాజు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



కొట్టక్కిలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఆనందరావు

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ



రాజాం : శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా పరిశీలకులు



సంతకవిటి: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి చిట్టి రాజు, అధికారులు

సంతకవిటి: మండల కేంద్రంలోని సమావేశ మందిరంలో రెండు రోజుల పాటు జరిగే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం సోమవారం 24 సచివాలయాల ఉద్యోగులకు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి చిట్టి రాజు, ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్‌ మాట్లాడుతూ జవాబుదారీతనం, బాలల వికాసం, సాంఘిక భద్రత, పేదరికం లేని మెరుగైన సమాజం, ఆరోగ్యపరమైన,స్వయం సమృద్ధి గల గ్రామం, మెరుగైన ఉపాధి, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం దదికుమార్‌, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ ఎంవీ రత్నం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనపై దృష్టి సారించాలి

రాజాం : ప్రతీ పంచాయతీలో పేదరిక నిర్మూలన, ఆకలిబాధలు నివారించి, ఆహార భద్రతను కల్పించడం, నాణ్యమైన విద్యను అందించడం లక్ష్యంగా చేసుకుని పంచాయతీల పాలక మండలి దృష్టి సారించాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. సోమవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా పరిశీలకులు ప్రసాదరావు, డీటీఎమ్‌ ఎస్‌.లోకనాథం తదితరులు శిక్షణలో మాట్లాడారు.

విద్యుత్‌ లైన్ల కింద వరి నూర్పిళ్లు చేయొద్దు..: ఏడీ

రామభద్రపురం: విద్యుత్‌ లైన్ల కింద యంత్రాలతో వరి చేనును నూర్పిడి చేయొద్దని విద్యుత్‌ శాఖ ఏడీ ఎం.ఉదయభాను నాయుడు సూచించారు. స్థానిక 33 కేవీ సబ్‌స్టేషన్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌ లైన్ల కింద యంత్రాలతో వరి నూర్పిడి చేయడం వల్ల గడ్డి వైర్ల మీదకు తుళ్లి మంటల చెలరేగే ప్రమాదం ఉందన్నారు. ఆ ప్రమాదంలో ఏదైనా జరిగితే సంబంధిత వరి నూర్పిడి చేసే యజమానే బాధ్యుడవుతాడని హెచ్చరించారు. అలాగే గడ్డి వైర్ల మీద పడడం వల్ల విద్యుత్‌ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలకు ఇబ్బంది కలిగితే చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈఈ శశిభూషణరావు పాల్గొన్నారు.



స్థానిక 33 కేవీ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏడీ ఉదయభాను నాయుడు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక సద్వినియోగం కావాలి

తెర్లాం: గ్రామాల్లోని ప్రజలు, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం తహసీల్దార్‌ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదకను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్‌ జి.హేమంత్‌కుమార్‌ అన్నారు. తన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు, రైతులు వచ్చి వారి సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. అనంతరం తహసీల్దార్‌ మాట్లాడుతూ ప్రతీ సోమవారం తహసీల్దార్‌ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నామని, గ్రామాల్లోని ప్రజలు, రైతుల వారి సమస్యలపై కలెక్టర్‌ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వెళ్లవద్దని సూచించారు. ఎంపీడీఓ రేగి రాంబాబు, ఉప తహసీల్దార్‌ జి.సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



తెర్లాం : ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న తహసీల్దార్‌ హేమంత్‌కుమార్‌

బాడంగిలో..

బాడంగి: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల ప్రజావేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్‌ సుధాకర్‌, ఎంపీడీఓ రామకృష్ణ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీసీ ద్వారా కలెక్టర్‌ సూచనలు, సలహాలను స్వీకరించారు. మండల స్థాయి అధికారులు ఏఓ.శిరీష, పీఓ.రాజ్యలక్ష్మి, ఏపీఓ విజయలక్ష్మి, ఎంఈఓ – 2 రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

బాడంగి: ప్రకృతి వ్యవసాయంతో పండిస్తున్న ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ఎంపీడీఓ ఎస్‌.రామకృష్ణ అన్నారు. మండల పరిషత్‌ కార్యాలయం ఆవరణలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏర్పాటు చేసిన ఉత్పత్తుల స్టాళ్లను ఆయనతో పాటు పలువురు అధికారులు సోమవారం పరిశీలించారు. ఉత్పత్తులను ఒకేచోట పెట్టి విక్రయాలు చేపట్టారు. వీటిని ఎంపీడీఓతో పాటు ఎంఈఓ రాజేశ్వరి, ఏపీఎం, ఏఓ శ్రీలత, జూనియర్‌ సహాయకులు తిలక్‌ సిబ్బంది తదితరులు కొనుగోలు చేశారు. ఈ స్టాల్‌ను ముగడ యూనిట్‌కు చెందిన ఎంటీయూ వి.తులసి, ఎల్‌ 1 ఎక్కుడు ఈశ్వరరావు, ఐసీఆర్‌పీలు టి.కుమారి, ఎస్‌.భవాని, ఎం.అన్నపూర్ణ, ఎస్‌.ఇందిర, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కూరగాయలు, బెల్లం కొనుగోలు చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ, ఇతర అధికారులు

ఎమ్మెల్సీ పరామర్శ



శివ్వాంలో వెంకటనాయుడు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌

వంగర: మండలంలోని శివ్వాం, మగ్గూరు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ సోమవారం పరామర్శించారు. శివ్వాం గ్రామానికి చెందిన ఏనుగుతల వేమినాయుడు, మగ్గూరు గ్రామానికి చెందిన పోలిరెడ్డి కృష్ణంనాయుడు, రెడ్డి భాస్కరరావు ఇటీవల మరణించడంతో వారి కుటుంబబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో వంగర, వీరఘట్టం ఎంపీపీలు ఉత్తరావెల్లి సురేష్‌ ముఖర్జీ, దమలపాటి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ కన్వీనర్‌ కరణం సుదర్శనరావు, పార్టీ నాయకులు బొక్కేల సత్యంనాయుడు, పోలిరెడ్డి రమేష్‌, ఏనుగుతల వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఆధారంగా పోయిన బ్యాగ్‌ గుర్తింపు

రాజాం సిటీ: విశ్రాంత ఉపాధ్యాయుడు బ్యాగును ఆటోలో మర్చిపోగా దానిని సీసీ టీవీ పుటేజీ ఆధారంగా రాజాం పోలీసులు గుర్తించి సోమవారం అందించారు. ఈ ఘటనకు సంబంధించి టౌన్‌ సీఐ కె.అశోక్‌కుమార్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ పరిధి అమ్మవారికాలనీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఆర్నెపల్లి వెంకటనాయుడు భార్యతో పాటు ఈ నెల 13న సాయంత్రం విశాఖపట్నం బయలుదేరాడు. అమ్మవారి గుడి వద్ద ఆటో ఎక్కి తన బ్యాగును ఆటో వెనుక భాగంలో ఉంచాడు. బస్టాండ్‌ వద్దకు వచ్చేసరికి విశాఖపట్నం బస్సు రడీగా ఉండడంతో బ్యాగు మర్చిపోయి బస్సు ఎక్కిపోయాడు. కొంతదూరం వెళ్లిన తరువాత అప్రమత్తమై బ్యాగు ఆటోలో మర్చిపోయామని గుర్తించి బస్సు దిగి బ్యాగు ఉన్న ఆటోను వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆటో యూనియన్‌ అధ్యక్షునికి విషయం వివరించి అనంతరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి విశాఖపట్నం వెళ్లారు. బ్యాగులో రూ.32వేలతో పాటు దుస్తులు ఉన్నట్లు వెల్లడించారు. స్పందించిన పోలీసులు వెంటనే సీసీ కెమెరాల ఆధారంగా ఆటోను గుర్తించి బ్యాగును స్టేషన్‌కు తీసుకువచ్చారు. అందులో రూ.32వేలతో పాటు దుస్తులు ఉన్న బ్యాగును విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటనాయుడుకు సీఐ అప్పగించారు.



విశ్రాంత ఉపాధ్యాయుడికి నగదు, బ్యాగు అందజేస్తున్న సీఐ, సిబ్బంది

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

వంగర: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని దళిత బహుజన జేఏసీ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు ఎం.గణపతి, దళితసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.గణపతిరావు ఆరోపించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులాలు మధ్యన చిచ్చు పెట్టి రాజ్యాధికారాన్ని దూరం చేసేందుకు కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు. వైద్య, విద్య రంగాల్లో దళిత విద్యార్థులు వెనుకంజలో ఉన్నారని, విభజించి పాలించు తీరును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడనాడాలన్నారు. కులగణన చేపట్టాలని, బ్యాక్‌లాగ్‌ పోస్టులు భర్తీ చేయాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు చిత్తిరి గంగులు, కారు రామారావు, ఉదయ్‌, చిన్నసింహాచలం పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

సంతకవిటి: మండలంలోని సురవరం గ్రామంలో సర్పంచ్‌ ఘంటా షణ్ముఖరావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా సోమవారం చేపట్టారు. కాలువలలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించి డంపింగ్‌ యార్డ్‌కు తరలించారు. రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్‌ చల్లారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ గ్రామస్తులతో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను కాలువలలో వేయరాదని సూచించారు. తద్వారా ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు.



ధనుర్మాస నగర సంకీర్తనలు

ధనుర్మాసం ప్రారంభమైన సోమవారం మండలంలోని పాల్తేరు గ్రామంలో కలశాలు పట్టుకొని ప్రజలు నగర సంకీర్తన చేపట్టారు. ఈ నెల మహా విష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైనదిగా భావించి ధనుర్మాస విధి విధానం ప్రకారం అష్ట లక్ష్మీనారాయణుని ఆలయం వద్ద విష్ణుసహస్ర నామార్చన, లలిత సహస్రనామార్చన, తిరుప్పావై పారాయణం గావించారు. 108 మట్టి కలశాలకు తొలుత పూజలు చేసి 108 ద్రవ్యాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో భక్తులుపాల్గొన్నారు.

– బాడంగి



పన్నుల వసూళ్లకు స్పెషల్‌ డ్రైవ్‌

మున్సిపాలిటీలో ఆస్తి, ఇంటి పన్ను, కుళాయి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించని ప్రాంతాల్లో రేపటి నుంచి స్పెషల్‌ కలెక్షన్‌ డ్రైవ్‌ నిర్వహించాలని మున్సిపల్‌ కమిషనర్‌ ఎల్‌.రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో అన్ని సచివాలయాల అడ్మిన్‌ సెక్రటరీలు, ఆర్‌ఓ, ఆర్‌ఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ మున్సిపల్‌, సచివాలయ సిబ్బందితో కలిసి కలెక్షన్‌కు సహకరించాలన్నారు. డిసెంబర్‌ నెలాఖరు నాటికి వసూలు కావాల్సిన మొత్తం కంటే తక్కువ ఉన్నందున ప్రత్యేక బృందాలను సిద్ధం చేయాలన్నారు.

– బొబ్బిలి



విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

విద్యారంగ పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీడీఎఫ్‌ ఎమ్మెల్సీ అభ్యర్థిణి కె.విజయగౌరి అన్నారు. సోమవారం తన అభ్యర్థిత్వాని బలపరుస్తూ ముద్రించిన కరపత్రాలను ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదోన్నతుల విషయంలో అడ్‌హక్‌ పద్ధతిలోనే ప్రమోషన్‌ చానల్‌లో ఓపెన్‌ చేసేందుకు అవసరమైన ప్రత్యామ్నాయాలకు పాటు పడతానన్నారు. కాంట్రాక్ట్‌ లెక్చరర్లకు 114 జీఓ అమలు చేసేలా కృషి చేస్తానన్నారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రసన్నకుమార్‌, సత్యనారాయణ, ఆనెం శ్రీనివాస్‌, బి.శ్రీనివాస్‌అనంత్‌, పాల్గొన్నారు.

– బొబ్బిలి

భూ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ



రాజాం : గోపాలపురం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్‌ రాజు

రాజాం : పట్టణ పరిధిలోని కొత్తవలస, గోపాలపురం గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి పలు ఫిర్యాదులు తహసీల్దార్‌ ఎస్‌కే రాజు స్వీకరించారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఆయా గ్రామాల వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

గ్రామ సభలతో సమస్యల పరిష్కారం



రేగిడి: రెవెన్యూ సదస్సులో పాల్గొన్న రైతులు

రేగిడి: గ్రామ సభల్లో వస్తున్న సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్‌ ఎం.చిన్నారావు అన్నారు. సోమవారం ఆమదాలవలస, రేగిడి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు వినియోగించుకోవాలని వెల్లడించారు. సర్పంచ్‌లు, రైతులు, వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్‌

వంగర: ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో చదివి విద్యలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్‌ ఉంటుందని ప్రిన్సిపాల్‌ కొరటాన నారాయణరావు అన్నారు. మండల పరిధి మద్దువలస ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఇంటర్మీడియట్‌ బోర్డు ద్వారా సమకూర్చిన ఇంటర్మీడియట్‌ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో బీ, సీ గ్రేడుల్లో ఉన్న 150 మంది విద్యార్థులకు క్వశ్చన్‌ బ్యాంక్‌లు సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇంటర్‌ విద్యార్థులకు క్వశ్చన్‌ బ్యాంక్‌లు అందిస్తున్న ప్రిన్సిపాల్‌